
# తెగిన బంధాలు



'బస్సు వచ్చే టైం అయింది. ఈ బాలయ్యమామ ఇంకారాక పాయె. నిన్న కలిసినప్పుడు పదేపదే చెప్పిన. ఉడుము గుడ్లుపెట్టి మర్చిపోయినట్టు జేత్తడు. పొద్దుటిబస్సుకు పోవాలని అనుకుంటిమి' పొద్దుపొడుపుకు చేతిని అడ్డం పెట్టుకుని దారిపొడుగునా చూస్తూ విసుక్కున్నాడు లింగం. అతడి మాటల్లో విసుగుకంటే ఎక్కువగా బాధనేధ్వనించింది. బస్సు ఎక్కడ వెళ్ళిపోతుందో అనే తొందర ఒకవైపు, బాలయ్య రాలేదనే బాధ మరోవైపు కలగలిపి అతడిని ఉన్నచోట ఉండనీయడంలేదు. నిప్పునుతొక్కినకోతిలా తిరుగుతున్నాడు.

అతడిపక్కనే రాళ్ళతెట్టెమీద కూర్చుని నెమ్మదిగా బీడితాగుతున్నాడు దేవయ్య. లింగం బుడ్డగోచిని సర్దుకుంటూ అటూఇటూ తిరగడం, వదరడం అతడికి తమాషాగా ఉంది. "ఔ.... మంగలోల్లమామా! నువ్వంటే గోర్లుతీసే గోరుగాలు, ఇత్తడిగిన్నె గోచిల పెట్టుకుని దబ్బదబ్బ ఉరికత్తివి. కుమ్మరోల్ల తాతకు నీలెక్కరావత్తదా? కూరాల్లు,ఐరేండ్లు,గరిగెబుడ్లు,కంచుళ్ళు, మూటగట్టుకుని రావాలెనాయె. కొద్దిగ లేటయితది. నువ్వేదో కొంపలు మునిగిపోయినట్టు చేత్తున్నవు". బీడి దమ్ములాగి పొగను వదులుతూ వెక్కిరిస్తున్నట్టుగా అన్నాడు చేతులు తిప్పుతూ.

అతడిమాటలు చెవికెక్కనట్టు ముందుకు రెండు అడుగులు వేసినవాడల్లా చెవులురిక్కించివింటూ వెనక్కివచ్చి దేవయ్య భుజాన్నిపట్టి కుదుపుతూ అన్నాడులింగం. "దొర్సానివైనాలమనిషి. అన్ని పద్దతి ప్రకారం జరగాలంటది. కొద్దిగ లేటయిందనుకో.....మనకు

ఇచ్చేకట్నాలు ఇయ్యరు. పెండ్లీల ముందుముందుగ కుమ్మరోల్లపనే మొదలాయె. గాడిపొయ్యిలు తీసి కూరాల్లుచేసి లెంక కంకణాలు కట్టినాకనేగదా....పెండ్లి పనులు మొదలయ్యేది. బాలయ్య లేటయితే మనం ఉత్తచేతులతో ఊపుకుంట కూసోవలసిందే! అయినా అల్లుడా! వాడిన్ని కుండలు దెత్తడు. నేను గిన్నె, గోరుగాలును దెత్త నువ్వయితే ఉత్తచేతులతోని రావడితివి. వచ్చేటప్పుడయితే తూమెడుబియ్యం, వెయ్యిరూపాయలు ముల్లె కట్టుకచ్చుకుంటవు" ఎక్కసంగా.

దేవయ్యకు కోపం వచ్చింది. లేచినిలబడి ప్యాంటును దులుపుకుంటూ విసురుగా అన్నాడు. "నువ్వు చేసేపనేముందట. పదినిమిషాలుమైలపోలు రాసి తూమెడు వడ్లు తెచ్చుకుంటవు. పోలుమీద పెండ్లిపిల్ల కట్టుకున్న బట్టలు నీకేనాయె. మీదికెల్లి నూటపదార్లు కట్నం మిత్తి తీసిన పైసలు. నేను పెండ్లిపత్రిక పెట్టుకుంది మొదలు, పత్రికలు పంచుడు.... ఇక్కడున్న ఇంటికి సున్నమేసుడు..." దేవయ్య గొంతు ఆడపిల్ల గొంతులా సన్నగా ఉంటుంది. దానికితోడు చేతులూ తల ఆడిస్తాడు.

అతడిమాటలు పూర్తికానేలేదు అందుకున్నాడు లింగం.

"ఆ.......చేసినవు తియ్యిరా! పటేలు సిరిసిల్లలో ఉన్నాడు గాబట్టి సరిపొయింది. లేకుంటే సచ్చిపోయే సుట్టాల బట్టలు ఉతుకలేక సచ్చిపోదువు. అయినా చేసినందుకు ఏంచెడిపోతున్నవురా ! కూరగాయలు కొండబోతే కట్నం. పోలువోత్తే కట్నం. గొర్లను గోత్తె కట్నం, బోళ్ళుతోమితే కట్నం, సీతిరి కట్నం,పెండ్లిసామాన్లు ఎత్తుకపోతే కట్నం..."

బస్సు చప్పుడు వినిపించింది. లింగం నోరు మూతపడింది. దేవయ్య కూడా మాట్లాడలేదు. ఆగమాగాన రోడ్డు మధ్యలోకి అటూ ఇటూ పారజూసి 'ఓ..... బాలయ్యతాతా...' అని కేక వేశాడు.

లింగం ఆతృతగా రాళ్ళతెట్టెను ఎక్కి నిలబడి రోడ్డుకు ఆవలివైపు పారజూసి అన్నాడు. "ఆ..... వస్తుండు. వీపుకు ముల్లె వేసుకొని కోటగడ్డ దిగుతుండు". అని, "మామా.. జెట్టనరా.... బస్సువత్తుంది." అని కేకవేసి తెట్టె అంచును పట్టుకొని కిందికి దుంకాడు.

"ఆ... ముసలాయన కోడె దూడయితున్నాడు. దుంకులాడుతున్నాడు." నవ్వుతూ అన్నాడు దేవయ్య నడుమును ఊపుతూ...

"ఇప్పుడేం జూసినవు. నీ ఈడుకున్నప్పుడు కబడ్డీ ఆడితే నలుగురిని ఎత్తుకత్తుంటిని. ఇప్పుడు నీతోని ఉడికిన పప్పు ఉడుకది." మీసాలను దిద్దుకుంటూ అన్నాడు. అప్పుడే దుమ్ములేపుతూ బస్సువచ్చింది. దమ్ము ఎగపోస్తూ బాలయ్యకూడా వచ్చాడు. చేతిలో ఉన్న సంచిలో మూడుకుండలు, వాటి మీద కంచుల్లున్నాయి.

సంచివైపు తేరిపారజూసిన లింగం పెదవిని విరుస్తూ "అదేంటిదిమామా... మూడే ముంతలు తెత్తున్నవు" కూరాడు కుండలెవ్వి, పోలు ముంతలెవ్వి"? అన్నాడు ఆశ్చర్యంగా. అతడికేదో భయం మొదలైంది.

"ఈ మూడు ముంతలకే మూడిండ్లు దిరిగిన, వాటినెక్కడ తేవాలె. అయినా ఇప్పుడు కూరాళ్ళు గాడిపొయ్యిలు ఎవలు దీత్తుండ్రురా... అంతలావుంటె ఇత్తడిబిందెలు పెట్టుమంట. అంతదూరం ఐదుపది కుండలు ఎట్ల తీసుకపోవాలె. నెమ్మదిగా అన్నాడు బాలయ్య. గొంతు వణికింది. వయసుపై బడి ముడతలుపడ్డ చర్మం. వంగి నడుస్తున్నాడు.

" నీపని ఐనట్టే! దొర్సాని సంగతి కొత్తగ చూత్తున్నవా..? ఏది లేకున్నా ఊకుండది. నిన్ను మల్లా ఇంటిదాక ఉరికిత్తది." నవ్వుతూ అంటూ బస్సువైపు చూసాడు దేవయ్య.

బస్సుకు అదే చివరిస్టేజి. ఆక్కడినుండే వెనక్కి తిరిగి సిరిసిల్ల వెళ్తుంది. రోడ్డు పక్కనే తవ్విన పునాది. అది నింపడానికి కుప్పలా పోసిన రాల్లు ఇసుక ఒకవైపు, కాంక్రీటు కుప్పలు ఒకవైపు... బస్సు మరలడానికి ఇబ్బందిగా ఉన్నది. డ్రైవర్ విసుక్కుంటున్నాడు.

"అరే ఆడిగుట్లోడా.... పక్కకు జరుగురా" వెనుకనుండి ఎవరో అన్నారు దేవయ్యను. కోపంగా తిరిగి చూసాడు. ఎవరూ కనిపించలేదు. తనలోతానే గొణుక్కుంటూ పక్కకు జరిగాడు. బస్సు మలుగుతుంది. ఇక్కడ ఏం కడుతున్నరు. బంగులానా? ఎవరో అన్నారు.

"కాదు బస్టాండు" మరెవరో.

"కాదు కాదు మ్యారేజీ హాలు కొండల్‌రావు పటేలు కట్టిత్తుండు" ఎవరో అన్నారు. బస్సు బుర్రు బుర్రు మంటూ మలిగింది.

"ఆ.... ఆగనీ.....' చేతిలో ఉన్న పంచ్‌తో రాడ్‌పై టక్‌మని కొట్టి అన్నాడు కండక్టరు. అంతవరకూ ఎక్కడకూర్చున్నారో కాని పదిమందివరకు జమయ్యారు.

అందరూ ఎక్కికూర్చోగానే బస్సుముందుకు కదిలింది. ఎత్తువంపులతో కంకరదేలిన రోడు "ఐరేండ్లు, గరిగెబుడ్డిపైలం తాతా... ఏ ఒక్కటి భిన్నమైనా వట్టిదే ఇంటికిపోతే అమ్మ బువ్వ గూడా పెట్టది". హెచ్చరిస్తున్నట్టుగా అంటూ "లింగం మామా.. నీగోరు గాలు మెత్తగ నూరుకున్నావా లేదా? దాన్ని యాడ పెట్టుకున్నవో.... గోచిలగిట్లపెట్టేవు.. సక్కగ సామానుకు దిగుతది". అన్నాడు దేవయ్య నవ్వుతూ. బస్సు చప్పుడులో కీచుగొంతు ఎవరికీ వినిపించలేదు.

అప్పుడే పొద్దు కొద్దిగా పైకెక్కుతుంది. కొద్దికొద్దిగా చలిగా ఉంది. సన్నగా వణుకుతూ సీట్లో ఒదిగి కూర్చుని గురుగులకంటే పెద్దసైజులో ఉన్న మూడు పటువలను భద్రంగా పట్టుకున్నాడు బాలయ్య. పైకి అలా అన్నాడు కాని కూరాడుకుండలు లేకపోవడం వెలితిగా భయంగా ఉన్నది. ఎలాగో కష్టపడి ఐదు కుండలు సంపాదించే వాడే! మధ్యలో పంచాయతీ మొదలై ఎటూ తేల్చుకోకుండా చేసింది. ఒకడు బతికి పోతున్నాడంటే ఓర్వరు. పాడుమంది అనుకున్నాడు.

"ఏంటిది మామా.. నిన్న ఏదో పంచాది ఉందంటివి ఏం పంచాది." పక్కనే కూర్చున్నాడు లింగం. కాల్లుజాపి సర్దుకుని కూర్చుంటు అడిగాడు బాలయ్యను.

" ఏం పంచాదిరా... కండ్లచ్చినప్పుడు ఎవ్వడు లేడుగనీ పండ్లచ్చినప్పుడు అందరు మొగోల్లమంటారు. ఇక్కడున్నప్పుడు కొడుకు పెండ్లి చేసిండు. అప్పుడు నేనే ఇచ్చిన. పండుగు పబ్బాలకు పటేలు ఈ ఊరిలో ఉన్నంతమట్టుకు కుండా గురిగి నేనే ఇచ్చిన. పోయినేడు పెద్ద పటేలు సచ్చిపోతే కొత్తకుండ నాదే. ఇయ్యాల్లనీల్లు కొత్తగా కానూన్‌తీత్తరు. నాకు చెప్పే మొనగాళ్ళయింద్రు." గొంతుగరగరమంది. వయసుతెచ్చిన ఆయాసం, ఎగపోత పుట్టింది.

లింగం గొంతు అతని ఆకారంలా గంభీరంగా ఉంటది. వయసు మీదవడి కొద్దిగా కుంగిపోయాడు కాని చెయ్యెత్తుమనిషి. మనిషికి తగిన చెత్త. "మాకులపోల్లు అట్లనే గులుగుడు మొదలువెట్టింద్రు. నేను సందియ్యలేదు. ఎవ్వడు నోరు ఎత్తద్దని సెప్పిన. పెద్దమనిషి కాలం జేసినప్పుడు

నేనే గుండుగొరిగితి. పటేలువచ్చినప్పుడు నేనే గడ్డం మీసం కొరిగితిని. నాలుగు మాటలనంగనే ఎన్నడు నోరెత్తలేదు...." అన్నాడు. ".... ఇయ్యాల్ల ఇన్ని కట్నాలు దొరుకుతయిగదా! ఎట్ల దొరుకవట్టె అనే మంట... అందరికి."

"అందరికంటే మా కులమే నయ్యం. కష్టపడితేనే కట్నమత్తది. చేసుకోరా అన్నరు. ముందుగల్ల ఊరెల్లి పోయిన మనిషి పొత్తులకే వత్తడని గులిగినా శాతసాకలోనివి నీకే హక్కుంటది. నీతోకాదంటే సెప్పమన్నరు." వెనుకసీట్లో కూర్చున్న దేవయ్య ముందుకు వంగి అన్నాడు. వాళ్ల మాటలు విన్నాక. ".... చెయ్యని కట్టమత్తదా..? మొయ్యని బాడిగత్తదా..."

"ఓ ముచ్చట.. మీ ముచ్చట మీదేనా? టికెట్లు తీసుకోండ్రి. యాడికిపోవాలె..." కండక్టరు గద్దించాడు. ఇద్దరు డబ్బులు తీత్తుంటే తర్వాత లెక్క సూసుకుందామని ఆపి యాభై నోటు ఇస్తూ 'మూడు సిరుసుల్ల. అన్నాడు దేవయ్య.

బస్సు వెళ్తుంది. బస్సుతో పాటు ఆలోచనలు కూడా. ముగ్గురిలో ఉత్సాహం, అంతకుమించి ఆనందం ఉంది. రెండేళ్లకింద కొండల్‌రావు కొడుకు పెళ్ళి గుర్తుకొచ్చింది. గాడిపొయ్యిలుదీసి కూరాళ్ళకు లెంక కంకనాలు ఏసినందుకే నూటపదార్లు కట్నమిచ్చిండు. ఐరేండ్ల గరిగెబుడ్డిని ఎదురు కోవడానికి చప్పుడుతో వచ్చినప్పుడు ఐదుతవ్వల ఓడిబియ్యం, కుడుకా, కనుముబట్టా, యాభై ఒక్కరూపాయి కట్నమిచ్చాడు బాలయ్యకు. పెండ్లి తర్వాత ఇంటి కట్నం వేరే ఇచ్చిండు. అవన్నీ లెక్కగట్టుకుని ఇప్పుడు అంతకంటే ఎక్కువనే అత్తయి అనుకుంటున్నాడు బాలయ్య.

సాకలి దేవయ్యకయితే అప్పుడు నెలరోజులు పండుగనే. అక్కడేతిని అక్కడే ఉండుమన్నాడు పటేలు. దొరసాని మాట దురుసుగని ఎముకలేని చెయ్యి. పెండ్లి పోలు పోసేటప్పుడు రెండు సంచుల బియ్యం పోసుకున్నా ఎవరూ ఏమనలేదు. ఐదుగొర్లను గోస్తే వాటి కాల్లు, తలకాయలు, అర్రలబొత్తలు, దొబ్బలు. మిగిలితే కులానికంతా పంచిపెట్టిండు. ఇంటికి సున్నంవేస్తే మనిషికి మానెడు బియ్యం, ఇరువైరూపాయలు, ఇంటి కట్నం ఆనందంగా ఇచ్చిండు. పత్రికలు పంచడానికి బస్సుకిరాయిలిచ్చి పెండ్లి ఐనంక ఇద్దరాలుమొగలకు పెయ్యినిండ బట్టలుపెట్టి ఇంటి కట్నం ఐదువందలిచ్చిండు. పటేలు ఇల్లు సల్లగుండ!

మంగలిలింగం మైలపోలు రాసి తూమెడు వడ్లు పోలువోసుకున్నాడు. పోలుమీద పిల్లగాని పెయ్యిమీది కొత్తఅంగి లుంగి ఇచ్చి నూటపదార్ల కట్నమిచ్చిండ్రు. రెండు మూడు రోజులు కడుపునిండా తిండి. చిల్లరపనులు చేసినందుకు వేరే కట్నం. దొర్సాని కడుపు సల్లగుండ! మిగిలిన అన్నంకూర పెట్టిచ్చింది. మల్లమిత్తితీసిన కట్నం వేరే!

సున్నం వెయ్యడంతో మొదలైనసందడి నల్లపూసలు అల్లడంతో ముగిసింది. అంతవరకు ఏదో పనితో ముగ్గురూ ఇంటిసుట్టే తిరిగేవారు. ఒక్కొక్కరికి ఆరు నెలల గాసం దొరికింది. బిచ్చగాల్లకు గరీబోల్లకు మూడుపూటల తిండి.

బస్సు ఒక్కకుదుపుతో ఆగింది. ముందుకు తూలిపడబోయి నిలదొక్కుకున్నారు. ముగ్గురు. బాలయ్యనైతే ముంతల్ని గట్టిగా పట్టుకున్నాడు. ఆలోచనల్లోంచి తేరుకుని అటూ ఇటూ చూసి "ఊరులేదు. పల్లెలేదు. ఇక్కడెందుకు ఆపినవు." అన్నాడు దేవయ్య. రెండుచేతులు ముందుకు చాపి మట్టలను తింపుతూ డ్రైవర్ వైపు చూసి.

"ఆ కట్టమైసమ్మ బండిని కదలనియ్యదట. దిగి ఆసరపడుతవా?" అదేయాసతో అంటూ బస్సుదిగాడు డ్రైవర్. అందరూ నవ్వుకున్నారు.

"ఒసినీ బస్సుపాడుగాను ఇది ఇప్పుడే ఆగిపోవాల్నా. అగ్గోలెలగ్గమచ్చె అప్పుడే దొడ్డికచ్చె నన్నట్టు. ఇంకా మెట్టుగుట్టలన్న దాటలేదు. నడిచి పోదామన్నా లింగన్నపేట దగ్గరలేదు. ఇంకోబస్సిప్పుడు రాదు". లేచి నిలబడి చేతులు తింపుకుంటూ అన్నాడు దేవయ్య మల్లీ అలాగే.

"నీ ఆడిగుట్ల పీసునె గొడుదు ఒర్రకు." ఎవరో అన్నారు.

"లావురేషం రావట్టెనీకు. ఏం నొత్తుంది." బస్సుదిగాడు దేవయ్య గొణుక్కుంటూ.

అరగంటసేపు కుస్తీపట్టి బస్సు ఇక కదలదని చెప్పాడు డ్రైవరు. బస్సులో ఉన్న పదిమంది ప్యాసింజర్లు కండక్టర్‌తో వాదానికి దిగారు. టిక్కెట్టు చింపినాక డబ్బులు ఇయ్యమంటే ఎట్లా? రోడ్డుదాకా నడువుండ్రి అక్కడవేరే బస్సెక్కిస్తా." అన్నాడు కండక్టరు చివరగా. ఉసూరుమంటూ బస్సుదిగారు అందరు.

చుట్టూ గుట్టలు, వాటిని చీల్చుకుంటూ రాళ్లుతేలని కంకరరోడ్డు. అక్కడక్కడ బీడువారి నోళ్ళు తెరిచిన పంటపొలాలు. వర్షాలు లేక గడ్డికూడా మొలువలేదు. గుట్టమీద చెట్లు వాడిపోయినట్టున్నయి. మంచుకురిసే కాలమైనా ఏ ఆకుమీదా తేమలేదు.

డ్రైవర్ బస్సువద్దే ఉన్నాడు. రోడ్డును తిట్టుకుంటూ. కండక్టర్ వడివడిగా నడుస్తున్నాడు. మిగిలినవారంతా అతడి వెంట ఎక్కడ తప్పించుకపోతాడో అన్నట్టుగా నడుస్తున్నారు.

బాలయ్య మాత్రం ముల్లెను నెత్తిన ఎత్తుకుని మెల్లమెల్లగా నడుస్తున్నాడు. అతడికంటే రెండడుగులు ముందుగా భారీ శరీరాన్ని కదుపలేక కదుపుతున్నట్టుగా నడుస్తున్నాడు లింగం. వడివడిగా వెళ్తున్నవాడల్లా వెనక్కితిరిగి ప్యాంటును ఎగజెక్కుకుంటూ 'ఏమాయె... రాండ్రి..' అంటూ ఆగినడుస్తున్నాడు దేవయ్య.

"నేనయితే ముసలోన్నయితి. నీకేమయిందిరా.. అడుగులఅడుగేత్తున్నవు. నడువు". సరాయిస్తూ అదిలించాడు బాలయ్య లింగంను. నాకింక వయసు ఉరుకులాడుతుందా మామ. యాభై దాటినయి మోకాళ్ళు కదులనిత్తలెవ్వు. అడుగులు వేగంగా వెయ్యడానకి ప్రయత్నిస్తూ అన్నాడులింగం.

"ఆ... మీరు ఇట్ల నడిస్తే పెండ్లికికాదు మరువెండ్లికి అందుతం ముడితెబతుకనిపిల్ల ముద్దాడితె బతుకుతదా అన్నట్టు చాతగానోల్లు ఇంటిదగ్గరనే ఉండాలె. ఎందుకు ఆరాటపడాలె." విసుగ్గా అన్నాడు దేవయ్య.

"నువ్వురుకులాడకురా... ఒకసారిగిట్లనే! ఇదే కొండల్‌రావు పటేల్ లగ్గానికి మీ నాయిన ఉరుకులాడుకుంట సవారు కచ్చురమెక్కిండు. అప్పుడుగిట్ల బస్సులెక్కడియి. ఎంత దూరం పోవాలన్నా కచ్చురాలేనాయె. లగ్గానికి ఇరువై కచ్చురాలు బయిలెల్లినయి. ఒకలనువట్టక ఒకలు పైగొట్టుడు మొదలు వెట్టింండ్రు. మీనాయిన ఎక్కిన కచ్చురం ఎడ్లు నడువలేదు. మెల్లమెల్లగ అదిలిచ్చుకపోతుంటే ఉన్న కచ్చురాలన్ని ఎల్లిపోయినయి. కొత్త తొవ్వ. జెంగల్‌లో కాటగలిసిండు. మేము పొద్దుగూకుతుండగ పెండ్లిపిల్ల ఊరుకుచేరుకున్నం. మీ నాయిన ఎక్కిన బండి ఇగరాదు

కథా నిలయం
5304
శ్రీకాకుళం

అగరాదు. కూరుకురాత్రి దాటింది. చిత్రమేంటిదంటే తలువాల బియ్యం, బాసింగాలు, గరిగెబుడ్డి, పెండ్లి బట్టలు ఆ బండిలనే ఉన్నయి. తెల్లవారే ముంగట పెండ్లి. పటేలు మనిషినొకదిక్కు గెదిమిండు. ఎక్కడివాల్లమక్కడ కేకలేసుకుంట తిరిగినం. యాడ దొరుకడు. ఎటుదిరిగిండో.. జరాగితే పెండ్లనంగ చేరుకున్నడు. అప్పటిగ్గాని పాణాలు సల్లవడలేదు.'' చెబుతూ నడుస్తున్నాడు బాలయ్య.

మొదటి గుంపుదూరమయింది. అందుకోవాలని వేగం పెంచారు. వాల్లముచ్చట్లువింటూ మెల్లగా నడుస్తున్నాడు దేవయ్య.

"అబ్బో... వీల్ల నాయిన సన్నపోడుగాడు...'' ముచ్చట అందుకున్నాడు లింగం. "....చేసినంతసేపు పని మంచిగనే జేత్తుండె. కల్లువాసన జూత్తే మాత్రం మన మనిషి కాకపోతుండే. ఇట్లనే ఇద్దరు తలువాల బియ్యం ఎత్తుకుని ముత్తిరెడ్డి కొడుకు పెండ్లికి పోయినం. ఆ ఊర్లె బాగగాడుదులున్నాయ్. పెండ్లికి కొబ్బరాకుల ముత్యాలపందిరేసి గద్దెవేసి పూలదండలు చుట్టింద్రు. ఇప్పుడు ఇట్లగని, అప్పుడు ఏలగ్గమైనా తెల్లారెముందటనే అయితుండె. పొద్దందాక లగ్గాలే జరుగకపోతుండె.

ఇగ పిల్లగాన్ని ఎదురుకచ్చెదానికిపోతూ.... పందిరిదగ్గర మీ నాయినను కావలివెట్టింద్రు. అప్పుడు ఎదురుకునేందుకు జీబులెక్కడియి. ఉన్న మారాజులైతే గుఱ్ఱంమీద ఎక్కిచ్చుకత్తురు. ఏం లేనోల్లు నడిచివత్తురు. వాల్ల మామ ఎక్కడిదో డొక్కు సైకిలి పట్టుకచ్చి నాకిచ్చిండు. పిల్లగాన్ని దానిమీద కుసోబెట్టుకొని తీసుకురావాలె. చీకటిపూట ఎదురుకొనుడు. ఊరిమంగలోడు దీటి వట్టుకొని ముందట నడువాలె. అంతవరదాకనేను సైకిలు ముట్టనే లేదు. భయం భయంగనే తోసుకత్తున్న. ముందట మాదిగి దప్పులు. అక్కడో గురుజుంటది. దానికింద మోరి. అయింతొపైడి కాలుకు తట్టి ముందుకుసొలిగిన. చేతులసైకిల్ పిసికిపోయింది. సైకిలుమీదున్న పెండ్లి పిలగాడు మోర్లె గూలిండు. పెయ్యంత, బట్టలంత బురుదనే!''

"మొద్దుపీసునె గొడుదు...'' పెద్దగానవ్వుతూ అన్నాడు దేవయ్య....' పందికి పంది ఉన్నవు. సైకిల్ నూకరాలేదా?''

బాలయ్య ఆయాసపడుతూ నడుస్తున్నాడు. అప్పుడప్పుడూ చేతిని అడ్డంపెట్టి తారురోడు ఎక్కడుందో చూస్తున్నాడు.

నవ్వుతూ అందుకున్నాడు లింగం.'' ఇంక మీ నాయిన సంగతి చెప్పుత సూడు. తలువాల బియ్యం, కుడుకలు, పోకలు, ముల్లె పక్కనవెట్టుకుని పందిరికావలున్నాడు. అప్పటికే రెండుమూడు సీసల కల్లుతాగిండట. నడిజామురాత్తిరాయె. నిద్ర ఆగక అట్లనే ఒరిగిండట. ఈంత గాడుదులురాను. ఒక్క పువ్వులేకుండ గుంజినయి. గద్దెను తుక్కు తుక్కు తొక్కినయి. పందిరిని కూలగొట్టినయి. తలవాల బియ్యం ఇత్తులేకుండ బుక్కినయి. దురంగా సప్పుడినచ్చి లేచి చూసేవరకు ఏముంది! అంగడంగడయింది. ఇగనన్ను ఉంచరురా అనుకున్నడు. ఇంటితొవ్వ వట్టిండు. సైకిలు ఎత్తెయ్యంగనే నేనూ అదేపని జేసిన. ఇద్దరం మేల్ల కుంట్ల కలుసుకున్నం కరకర పొద్దుపొడవంగ.''

పడీపడీ నవ్వాడు దేవయ్య. బాలయ్య గూడా నవ్వుతున్నాడు. కండక్టర్ కేకవేయగానే నడకవేగాన్ని పెంచారు. దూరంగా తారురోడ్ కనిపిస్తుంది. అప్పుడప్పుడు లారీలు జీపులు వెళ్తున్నాయి. బాలయ్య సత్తువనంతా కూడదీసుకుని నడుస్తున్నాడు. అతడి భుజం మీది మూటను దేవయ్య అందుకున్నాడు.

"ఇది ఆకిరి లగ్గం. ఈసారి బాగనే వత్తయి కట్నాలు." మూటనుమార్చుకుంటూ అన్నాడు దేవయ్య. ఈ కట్నాలతో ఎక్కడెక్కడి బాకీలు తేరుపాలెనో ముందుగానే నిర్ణయించు కున్నాడు. లగ్గంలో బియ్యందొరుకుతయని, బియ్యం సంచిగూడ కొనలేదు ఇంటికి. "లగ్గం ఊర్లె జేస్తే మనకు సతువుండు. ఎరుగని ఊర్లె మొరుగని కుక్క అన్నట్టు అక్కడెట్లుంటదో." నిరుత్సాహంగా అన్నాడు లింగం.

"ఎట్లుండుడేంది. పటేలు మనల్ని తప్పకరమ్మని సెప్పె. నిన్నయితె మరీ మరీ యాదిజేసిండు." నడుస్తూ అన్నాడు దేవయ్య.... "మనం ఇప్పుడు ఇట్లగని... ఎనుకట పెండ్లీలు మూడురోజులు పోదురు. ఒక ఇంట్ల పెండ్లైందంటే అన్ని కులాలకు పని దొరుకుతుండె. ఇప్పుడు పెండ్లి పనులనుంచి ఒక్కొక్క కులం ఎడబాసిపోయె. మనం ముగ్గురమే మిగిలితిమి." నిట్టూరుస్తూ అన్నాడు బాలయ్య.

మాటల మధ్యలోంచి తలెత్తి చూస్తె తారురోడు వచ్చింది. రోడు ఎక్కగానే ఎదురుగా ఒక బస్సువచ్చింది. అందరినీ బస్సులోనికి ఎక్కించాడు కండక్టరు. అందరూ ఆయాసంగా బస్సెక్కారు.

"బస్సు సల్లగుండ పెట్టే పైసలు తప్పకపాయె, నడుసుడు తప్పకపాయె!" చేతులు తిప్పుకుంటూ సీట్లో కూర్చున్నాడు దేవయ్య.

"ఆడిగుట్లొల్లు ఎక్కితే అట్లనే ఉంటదిమరి." వెనుకనుండి ఎవరో అన్నారు. గొల్లున నవ్వారు అందరు.

కోపంగా వెనక్కి తిరిగిచూస్తె ఎవరూ కన్పించలేదు. ఆ... కోపాన్నంతా లింగంమీద చూపిస్తూ.."ఈ రుమాలెందుకు సుట్టుకత్తున్నవు ఇంటి దగ్గర పడేసి రాక." అన్నాడు దేవయ్య.

అతడి కోపానికి లోలోపల నవ్వుకుంటూ సరాయించి మీసాలను సవరించుకుంటూ "నీకు తెల్వదోయ్. మైల పోలు రాయంగ నెత్తికి రుమాలుండాలె. లేకుంటె దొర్సాని మెడలువట్టి ఇవుతలికి నూకుతది. వాల్ల కొడుకు పెండ్లీల ఏమైందెరుకేనా? పెండ్లి పోలు పోసినంక పిల్లగాడు పోలులో అడుగు బెట్టే దాకా సాకలోడు బయటకు రావద్దట. ఆ విషయం అక్కడి సాకలోనికి తెలువదట. దబదబ పోలువోసి పోదామనుకున్నడట. నాలుగులిట్టి పిల్లగాడు పోలులోనికి అడుగువెట్టేదాక ఇవుతలికిరావద్దని సెప్పిందట. అప్పటికింకా పెండ్లి పిలగాడు తయారుకానేలేదు. సాకలోనికి ఒత్తుగ దొడ్డికత్తుందట. ఇగ జెప్పు ఆ కథ ఎట్లున్నదో." అన్నాడు నవ్వుతూ..

కోపాన్ని మరిచి పక్కున నవ్వాడు దేవయ్య. చుట్టూ ఉన్నవారు వారివైపు విచిత్రంగా చూశారు. వీల్లు మాత్రం ఎవరినీగమనించలేదు. ముగ్గురూ ఒకే సీట్లో కూర్చున్నారు. బస్సు దిగే వరకు పెండ్లిముచ్చట్లే!

దిగినాక దేవయ్య ముందుగా నడుస్తుంటే ఇద్దరూ అతడి వెంటనడుస్తున్నారు. రోడ్డుకు రెండు దిక్కులా దుకాండ్లు. లైన్లు కట్టి పరుగుతీస్తున్న వాహనాలు.

"దేవిగాడు ... జెరాగితే పిల్లగాన్ని తోలుకరాను పోతడేమో! కూరగాయలకట్నం బాగా అడుగురా..."వెనుకనడుస్తున్న బాలయ్య అన్నాడు. లింగం ఇంకేదో అన్నాడు. దేవయ్య మాట్లడలేదు. ఇల్లు చేరుకునే వరకూ అందరూ మౌనంగానే ఉన్నారు.

అనుకున్నట్టుగా ఇంటి ముందు సందడిలేదు. టెంట్ మాత్రం వేసి ఉంది. పచ్చటి తోరణాలు గుచ్చారు. పిల్లను పెండ్లి కూతురుగా తయారు చేయడానికి బ్యుటీషియన్‌ను తెప్పించారని విని ఎందుకోతెలియక తికమక పడ్డారు ముగ్గురు. ఒకరిద్దరు ఆడా, మగా, అప్పుడప్పుడూ ఇంట్లోకి, బైటకు వెళ్తున్నారు. ఎవరికోపనిని పురమాయిస్తూ బయటకు వచ్చిన కొండల్‌రావు ముగ్గురినీ చూసాడు. దగ్గరగా వచ్చి, 'అరే... ఎప్పుడచ్చింర్రురా... ఇక్కడ కూర్చున్నరేందిరా..? లోపలికిరంర్రి' అంటూ ఆదరంగా పలుకరించాడు. ఇంట్లోకి వెళ్లగానే దొర్సాని, పిల్లలు, కోడండ్లు అందరూ సంతోషంగా పలుకరించారు. వారి పలుకరింపులు కొత్త ఉత్సాహాన్ని పుట్టించాయి.

ఐరేండ్ల కుండను అపురూపంగా అందిస్తూ భద్రపరుచుమని చెప్పాడు బాలయ్య. తానుకూడా సిద్ధమై వచ్చినట్టుగా బట్టలో చుట్టిన గోరుగాలును, ఇత్తడిగిన్నెను అందిస్తూ 'దొర్సానీ ఇవ్వటిని గూడా దాసి పెట్టుంర్రి. యాల్లకు దొర్కయి మీరు ఇదిలేదు అదిలేదు అంటరు' అన్నాడు లింగం. దేవయ్యనైతే కలుపుగోలుగా అప్పటికే ఇంట్లోకి చొచ్చుకొనిపోయాడు. ఇచ్చిన సామాన్లను కోడలికి అందించి బలవంతంగా వాళ్ళకు భోజనాలు వడ్డించింది దొర్సాని.

'ఊరుమారినా ఆమె మనసు మారలేదు. సల్లనితల్లి!' అనుకుంటూ భోజనం చేస్తున్నా మనసును తొలిచే అనుమానం మాత్రం జీర్ణంకావడంలేదు ముగ్గురికి. అడగాలని నోరు తెరిచినా అడగలేక అన్నంముద్దను కుక్కుకుంటున్నారు. 'అలా ఎందుకైతదిలే' అని తమను తాము సరిపుచ్చుకుంటున్నారు. అయినా ఏదో! బెంగ! తొండనుమింగిన అనుమానం.

మైలపోలు రాసేందుకు భోజల బండికాని ఏదిరా? అని అడుగుతదేమోనని లింగం భయపడ్డాడు. కూరాడుకుండలేవీ అని అడుగుతుందేమోనని బాలయ్య భయపడ్డాడు. ఇంత కాల్చిన సున్నం పట్టుకురావద్దారా? అని అంటుందేమోనని దేవయ్య భయపడ్డాడు. దొర్సాని ఏవీ అడుగకుండా కొసరి కొసరి వడ్డించడంతో తేలిగ్గా ఊరిపి పీల్చుకున్నా మనసులో ఏదో భయం మొదలైంది.

గుండె దడ దడలాడుతుండగానే భోజనం ముగించారు. బాలయ్య లింగంలు వచ్చి టెంటుకింద కూర్చున్నారు. దేవయ్య ఏదోపని చేస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాడు. అతడి మాటలు, చేతులు తిప్పుతూ యాక్షన్ చూసాక నవ్వుకుంటూ ఏదో ఒకపని చెబుతున్నారు. 'మీకు నేనే దొరికినానుండ్లా... ఇసీ పాపం పాడుగాను ఏం పాపమిది.' మూతులు, చేతులు, నడుము తిప్పుతూ మరింత ఉషారుగా పని చేస్తున్నాడు దేవయ్య.

పొద్దు గడుస్తుంది. ఇంట్లో వీడియో కెమెరా తిరుగుతుంది. అప్పుడప్పుడూ ఫొటో ఫ్లాష్‌లూ.. అటూ ఇటూ పొక్కగాని పాములెల్లెక్కతిరిగి మళ్ళీ టెంట్ కిందికే వస్తున్నారు ముగ్గురు. తమలో తాము ఏదో గొనుక్కుంటున్నారు. గుసగుసలాడుకుంటున్నారు. మాటల సరదా తీరాక ఎవరో కసురుకున్నట్టున్నారు. మొహం చిన్నబుచ్చుకుని టెంట్ కిందికి వచ్చాడు దేవయ్య.

"ఏమాయె అల్లుడా... ఇంక పిల్లగాని తోలుకరాను ఎప్పుడుపోతవు. రేపే పెండ్లాయె." ఎత్తిపొడుస్తున్నట్టుగా అన్నాడు లింగం దేవయ్యను. "ఏదీ... ఏం సప్పుడు లేదుగదా.... ఓ కుమ్మరోల్లతాతా... లెవ్వు! లేచి గాడిపొయ్యిలు తవ్వుపో.... సాలిచ్చుకున్నవు." అన్నాడు నవ్వుతూ దేవయ్య.

బాలయ్య మాట్లాడ్డంలేదు. అతడి ఆలోచనలు ఎక్కడో ముడిపడ్డాయి. ఏ జ్ఞాపకాలనో

నెమరువేసుకుంటున్నాయి. అది ఎవరిపెండ్లి? ఎవరి పెండ్లి అయినాసరె! ముత్తులకు లెంక కంకనాలు పెట్టాల్సిందే! తన ఇంటికి చప్పుడుతో రావాల్సిందే. కూరాళ్ళయితే రెండురోజుల ముందే తీసుకెళ్తారు. ఐరేండ్లప్పుడే తనింట్లో సందడి. కొత్త దోతి, అంగీ తొడుక్కొని తనుండాల్సిందే! కులవృత్తి ఏనాడో పోయింది. ఒక్క పెండ్లి తంతు తప్ప. అదికూడా ఈనాడు దూరమవుతుంది.

వదినమరుదలో, బావమరుదులో ఏదో ఒకవరుస ఉన్నవారే ఐరేండ్లు గరిగెబుడ్డిని ఎత్తుకోవాల్సిందే! తాంబూలంనిండా తనకు బియ్యం, ఐదు కుడుకలు, కనుము, ఖర్జూరపు పండ్లు, చిల్లర కట్నం. ఇలాంటి పెండ్లీలు రోజూ జరగాలనే తన దీవెన! కనీసం పెండ్లీలకైనా తన సారె తిరగాలనే ఆశ!

మొగాళ్ళయితే భార్యల పేరడిగి, ఆడవాళ్లయితే భర్తల పేరడిగి జాజుతో పలకలు అద్ది గీతలు గీచిన ఐరేండ్లు తన చేత్తోనే నెత్తిమీద పెట్టాల్సిందే!

పెద్దిండ్లలో పెండ్లి జరుగుతుందంటే నెళ్ళాల్ల ఖర్చులు దొరుకుతాయన్న ఆశ. బియ్యం దొరుకుతాయన్న సంబూరం. ఇంటిల్లిపాదికి విందు భోజనం. వారంరోజులు చేతినిండాపని.

పెండ్లి సంబరాలనుంచి ఒక్కొక్కకులం దూరమయింది. పల్లకిమోసే బెస్తవాల్ల నుంచి తోరణాలకు నులుకతాడిచ్చి డప్పులు కొట్టే మాదిగలదాకా! సంబరంగా, అదొక వృత్తిలా చేసే పనుల్లోకి వ్యాపారం, పెట్టుబడి, సొచ్చుకచ్చింది. వేరుచేయలేవన్న కులవృత్తులుకూడా ఇప్పుడు... మిగిలిన ఆ ఒక్క జ్ఞాపకం తెగిపోయింది.

"మామా.... ఓ బాలయ్యమామా... ఏందే మాట్లాడవు. ఏమైంది?" లింగం కుదుపుతో మామూలు మనిషయ్యాడు బాలయ్య

అప్పటికే పొద్దువాలింది. కార్లమీద మోటారు సైకిళ్ళమీద ఎవరెవరో వస్తున్నారు. వచ్చినంత తొందర గానే వెళ్ళిపోతున్నారు. పటేలు స్కూటర్‌మీద ఎక్కడెక్కడో తిరిగివస్తున్నాడు. మళ్ళీ వెళ్తున్నాడు. పొద్దుగూకుతుండగా తమ్మలిసొన్నాయి వాడొచ్చి పావుగంట సేపు పలికి వెళ్ళాడు. ముగ్గురు టెంటుచుట్టూ కాలుగాలిన పిల్లుల్లా తిరుగుతున్నారు. అప్పుడప్పుడు ఇంట్లోకివెళ్ళి ఏదో సమాచారం తెస్తున్నాడు దేవయ్య.

రాత్రి భోజనాలకు మరోసారి పిలుపు. నిరుత్సాహంగా చేతులు కడుక్కున్నారు. ఎక్కువమంది చేరుకోవడంతో ముగ్గురుని టెంటులోనే కూర్చోబెట్టారు. పక్కనే కుర్చీ వేసుకుని కొండల్‌రావు కూర్చున్నాడు మాట్లాడుతూ అమెరికా సంబంధమని, ఆస్తి ఉన్నవారని, ఏదేదో చెబుతున్నాడు. అతడి మాటల్లాగే ముద్దలు కూడా మింగుడు పడడం లేదు. ఎప్పటినుండో అడగాలని ఉన్నా అడగలేక తనకుతానె సిగ్గుపటి మానుకున్నాడు దేవయ్య.

భోజనాల తర్వాత లింగయ్యకు పిలుపువచ్చింది. పోయిన పాణం లేచివచ్చినట్టయింది. గోచినిగట్టిగా చెక్కుకున్నాడు. మొహాన్ని రుమాలుతో తుడుచుకున్నాడు. రుమాలును నెత్తికి చుట్టుకున్నాడు. రాకరాక ఏదో గొప్ప అవకాశం వచ్చినట్టు హైరానా పడిపోయాడు. మిగిలిన ఇద్దరు అతనికి గుసగుసగా సలహాలిస్తున్నారు. ఎక్కడినుండో కుంకుమ బొట్టును తెచ్చి నుదుట పెట్టాడు దేవయ్య. కొత్తకొత్తగా పెండ్లికార్యంలోనికి అడుగు పెడుతున్నట్టు జేబులో మడిచిపెట్టుకున్న సంచిని

బాలయ్యకు ఇచ్చి ఇంట్లోకి అడుగుపెట్టాడు లింగం. ముగ్గురి మొహాలు వికసించాయి.

ఐదు నిమిషాలు గడువనేలేదు. మళ్లీటెంట్‌లో వాడిపోయిన మొహంతో ప్రత్యక్షమయ్యాడు లింగం. అతడిని చూసి ఇద్దరూ ఎదురెళ్ళారు. ఏం జరిగిందో అర్థకాకపోయినా అతడు చేసే పని మాత్రం మొదలు కాలేదని అర్థమైంది. బాలయ్య మౌనంగా ఉన్నా దేవయ్యనే అడిగాడు ఏమైందని.

"ఏంలేదురా... అటుకుమీద సూట్‌కేస్ అందలేదట. నేను పొడువుగా ఉన్నానని నన్ను పిలిచారు." నీరసంగా కూర్చుంటూ అన్నాడు. ఎవరూ మాట్లడలేదు. చలికి ఒదిగి కూర్చున్నారు. ఏదో బాధ గుండెను మెలితిప్పుతుంది.

ఇంట్లోకి వెళ్ళేప్పుడున్న మధురానుభూతిలోంచి లింగం ఇంకాతేరుకోలేదు. అతని కళ్ళముందు నెత్తికిరుమాలు సుట్టుకొని నుదుట బొట్టుపెట్టుకుని పోలురాసుడు, భోజల బండికాని కనిపిస్తుంది. పిల్లయినా, పిల్లగాడైనా, ఎవరో ఒక తోడుతో భోజలకానిపై కూర్చోవలసిందే!

'దొర్సానీ... వడ్లుతేంఢ్రి.. ఇవ్వే సాలుతయా....?' పెండ్లిరేపనగా మైలపోలు తీసుడు. ఇత్తడి తట్టలోని వడ్లను దోసిడితోముంచి పోలుపోస్తున్నాడు. బండికానిచుట్టూ నాలుగు గీతల చతురస్రం. దాని చుట్టూ మరొకటి. అంచులకు గుండాలు. అడ్డంగీతలు, పోలు ముంతల చుట్టూ దారం, మామిడాకుల కంకణాలు, ఐదుగురు వరుసగా పోలుపోసుడు.

ఇత్తడి తట్టతో ఐదు సార్లు తేవలసిందే. ఇల్లు తీరు తట్ట పెద్దిండ్లల్లో పెద్దతట్ట నెత్తికి నూనె పెట్టి పెయ్యంతా పసుపురాసి కాల్లవి వేల్లవి గోర్లు కత్తిరించడం. పెయ్యి మీదున్నబట్టలు తనకే! ఏం లేదన్నా తూమెడు పదికుంచాల వడ్లు. నూట పదార్లు కట్నం. మిత్తితీసిన పైసలు. ఐదుగురు ముత్తయిదువులతో వడ్లమిత్తితీసుడు.

తాతల తండ్రులనాటి చరిత్ర, ఏండ్ల తరబడి పెండ్లీలతో మమేకమైన జీవితాలు. ఆధునికతకు అలవాటు పడ్డాక మారిన అలవాట్లు, అలవాట్లకు తగినట్టుగా మారిన కులవృత్తులు, కత్తి కలుప పట్టుకొని ఇండ్లు దిరిగి గడ్డాలు గొరిగే స్థానంలోంచి ఎదిగిన పోరగండ్లు... రోడ్డుమీది టేలా డబ్బల్లోకి చేరడం, ఊర్లో జరిగే పెండ్లీలను నమ్ముకుని తను ఊరిలోనే ఉండడం.....అన్నీ గుర్తుకొస్తున్నాయి.

కత్తికట్నం అడిగే రోజుల్లోంచి కత్తికి పనిలేక కత్తెర పట్టుకుని రోడ్డునపడే రోజు వరకు బేరీజువేసుకున్నాక మిగిలి పోయిన పెండ్లి సంబరాల సంబంధాలు ఇప్పటితో పుటుక్కుమని తెగిపోయినట్టయింది. తన భార్య మంత్రసానిగా చేసేది. బొడ్డుగోసి పురుల్లుచేసేది. పచ్చిబాలింతలకు తలస్నానాలు, పురుడుకట్నాలు, మక్కగుడాలు, కల్లుసీసలూ.... మనిషి పుట్టుక, పెండ్లి, సావుదాక ఒక వృత్తితో మరొక వృత్తికి అల్లుకుపోయిన అవసరాలు ఎక్కడోతీరిపోతున్నాయి. డబ్బుతోనే డబ్బు పుడుతుంది. జీవితంలో ముడిపడిన అవసరాలు అవకాశంగా పెట్టుబడులు పెరిగిపోతున్నాయి.

ఎవరో కుదుపగా లేచినిలబడ్డాడు లింగం. చలాకిగా తిరిగే దేవయ్యలోకూడా ఉత్సాహం చచ్చిపోయింది. టెంటులోకి రెండుకార్పెట్లు వచ్చాయి. పటేలు ఇంట్లోకి వచ్చి పడుకొమ్మని బలవంతం చేసాడు. అక్కడే బాగుంటుందని టెంట్‌లోనే కార్పెట్లు పరుచుకున్నారు. ఒకటి కప్పుకున్నారు. వణుకుపుట్టించే చలి దానికంటే ఎక్కువగా వణికించే భయం. పెండ్లి పనుల్లోంచి తాము వేరు

చేయబడ్డామని. ఒకరు ఒకరితో మాట్లాడుకోవడంలేదుగాని, అగాదాల్లాంటి ఆలోచనలతో కొట్టుకుపోతున్నారు.

' పిల్ల గానిది ఏ ఊరో! ఏ పల్లెనో! ఈటైంకు ఊర్లె ఉందుంటి. కూరగాయల కట్నం కాడనైతే ఇంతవరకు ఎవరితో పేచీ పెట్టుకోలేదు. ఎంత ఇస్తే అంతే తీసుకున్న' అనుకున్నాడు దేవయ్య. 'రకానికొక్కటి కూరగాయలను మూటగట్టుకుని పిల్లగాన్ని తోలుకరావడానికి పోదుంటిని. మా నాయినయితే అందరికంటే ముందుగనే నడిచిపోయి ఎంతమంది వస్తుండిరో చెప్పుతుండెనట. ఇప్పుడు అదిలేదు ఇదిలేదు. ఉన్నది ఊసిపాయె. దిడ్డిపాసిపాయె.' దేవయ్యలో వణుకు.

ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం లేదుగాని ఎవరు ఏం ఆలోచిస్తుండ్రో తెలిసిపోతుంది.

వారం రోజుల పెండ్లిలనుండి గంటల పెండ్లిలవరకు జరుగుతున్న మార్పులను, జరిగిన రోజులను గుర్తుకుతెచ్చుకున్న బాలయ్యకు ఎందుకోగానీ మరీ వెలితిగా వుంది. మార్పుజరిగిన రోజుల్లోంచి మాత్రమే చూసి కారణాలు వెతుకుతున్న దేవయ్యకు ఇలా జరగడం కొంతవరకు మామూలుగానే అనిపిస్తుంది. ఎటూ తేల్చుకోలేని స్థితిలో ఉన్న లింగం జీర్ణమై, జీర్ణంకానట్టు తొక్కులాడుతున్నాడు.

ఏ రాత్రికో గానీ..... నిద్రపట్టలేదు. లేచి చూస్తే ఇంట్లో సందడి. దేవయ్యకు ఇంట్లో చిల్లరపని దొరికింది. బాలయ్య పైపును అందుకుని నీల్లునింపడం మొదలుపెట్టాడు. బట్టల సూట్‌కేసులూ ఇంట్లకూ బయటకూ మోయడంలో మునిగిపోయాడు లింగం. బాధను మర్చిపోవడానికే ఏదోపని చేస్తున్నట్టున్నారు ముగ్గురు. బేలగా చూస్తున్నారు. అప్పుడే బీరిపోయినట్టు నిలబడుతున్నారు. అప్పుడే ఉల్కిపడి పనిలో మునిగిపోతున్నారు.

పొద్దుపైకెక్కుతున్న కొద్దీ హడావుడి పెరిగింది. అందరినీ ఎక్కడో కట్టగట్టి ఆపి ఒక్కసారి వదిలేసినట్టు గుంపులు గుంపులుగా జనం రావడం మొదలెట్టారు.

ముగ్గురికి టిఫిన్‌తిన్న ప్లేట్లు కడిగేపని దొరికింది. దేవయ్య ప్లేట్లను తెచ్చి ఇద్దరి ముందు వేస్తున్నాడు. పెద్ద పెద్ద దేకీసాలు, బగోన్లు, అండలు కడుగుడు, వాటికి మసి అంటకుండా బురుదను పెట్టించుడు, తోమినందుకు కట్నం అడుక్కునుడు అన్నీ గుర్తుకువస్తున్నాయి. చేతులపని ఎవరో లాక్కున్నట్టనిపించింది.

"ఏది తప్పిపోయినా తిండి మాత్రం తప్పదుగదా! బొల్లు తోమేపని దేవిగానికి తప్పక ఉంటదనుకున్న. ఆ పనిగూడా గోవిందా... హోటలోల్లకు ఆడరిచ్చిండ్రట." ప్లేట్లు కడుగుతూ అన్నాడు లింగం.

పేలవంగానవ్వి పనిలో పడ్డాడు బాలయ్య ఎక్కడినుండి చూశాడో కొండల్‌రావు పరుపరుగున వచ్చాడు. అతడి మొహం నిండా బాధ.

"అరేయ్...... మీరెందుకు కడుగుతున్నార్రా.... కడిగేందుకు మనుషుల్ని పెట్టిన... మీరు లేచి టిఫిన్‌లు తినుండ్రి.... అంతే...!" అంటూ ఎవరినో ఏదోపురమాయిస్తే ఇద్దరు ఆడమనుషులు వచ్చి చేతుల్లోని ప్లేట్లను లాక్కున్నారు.

ఆ పని చేయడం ఏ మాత్రం అవమానంగా లేదు ముగ్గురికి. పోగొట్టుకున్న పనేదో

వెదుక్కున్నట్టుగా ఉంది. చేతుల్లోని పనిని ఎవరో లాక్కున్నట్టుగా ఉంది ఇప్పుడు. ప్రాణం గిలగిల కొట్టుకుంటుంది. కలలో నడుస్తున్నట్టుగా ముందుకు కదిలారు ముగ్గురు.

టిఫిన్లు కాగానే పెండ్లికి ప్రయాణమయ్యారు. పొద్దున్నుంచి మేకప్‌కు కూర్చున్న పెండ్లి కూతురు కారులో బయలుదేరింది. వెంట కెమెరాలు, మిగిలిన వారు జీబుల్లో. జీబుల్లో సర్దాల్సిన సూట్‌కేసులు సర్ది చివరి ట్రిప్పులో ముగ్గురు ఎక్కారు. ఎక్కడికి వెళ్తున్నారో తెల్సిపోయింది.

వెంకటేశ్వరా ఫంక్షన్ ప్యాలెస్ బోర్డులేత ఎండకు మెరుస్తుంది. ముందు కార్లు జీపులు, సైకిల్ మోటార్లు, రకరకాల మనుషులు. పైన వేదిక చుట్టూ అల్లిన పువ్వులు, సన్నాయి చప్పుడు, స్పీకర్లో పంతులు చదివే పద్యాలు ఎక్కడ చూసినా ఖరీదైన వాతావరణం, మాటలు..... నడక!

స్టేజికి అటువైపు ఇటువైపు రెండుగదులు అటూ ఇటూ తిరుగుతున్న ఆడవారు. కింద వరుసగా కుర్చీలు.

ముగ్గరూ చివరగా వెళ్ళి నిలబడ్డారు. పెండ్లి కార్యక్రమం మొదలైంది. పటేలు, దొర్సాని, కొడుకు, కోడలూ... ఎవరుతలెత్తి చూసినా తమకొరకే అన్నట్టుగా ముందుకు కదులుతున్నారు. ఏ పద్దతిలో సాగుతుందోకాని కార్యక్రమం నడుస్తుంది. అంతవరకు గమనించ లేదుగాని అక్కడున్న వారిని చూసాకా సిగ్గుగా తమనితాము చూసుకున్నారు. అందులోనికి రావడానికిగూడా ఒక హోదా ఉండాలన్నట్టుగా అక్కడి మనుషులందరూ ఒకేరకమైన దర్పంతో డాబుతో కనబడుతున్నారు. అది గుర్తించాక ముళ్ల మీద నిలబడ్డట్టుగా ఉంది ముగ్గరికి.

రెండు వైపుల రెండు కెమెరాలు, రెండు మూడు ఫొటో కెమెరాలు, సెంటు స్ప్రే, హడావుడిగా తిరిగే మనుషులు. ఫంక్షన్ ప్యాలెస్‌లో పెళ్ళి అంటే విన్నారుగాని ఇలా ఉంటుందని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు.

"అరే దేవయ్యా! పటేలు ఎవలకొరకో చూస్తుండురా.... నీకోసమే కావచ్చు. ఇప్పుడు పోలు పోత్తరు కావచ్చు. రుమాలు చుట్టుకొని పోరా...." మోచేత్తో పొడుస్తూ ఉడికిస్తున్నట్టుగా అన్నాడు లింగం.

"ఈః.... సాలుతియ్యి... నీ మురిపెమే జెప్పరాదు. పిల్ల పిలగాడు ఎదురెదురుగా కూసున్నారు. ఇప్పుడు పోలు పోసుడేంది చిత్రంగ". అన్నాడు నీరసంగా దేవయ్య.

దోసిల్లతో బియ్యం ముంచి పోలు పొయ్యటం, బియ్యం తీసుకురండని గదమాయించటం, పోలు ముంతలు, దారాలు, పసుపుకొమ్ములు, కంకణాలు అన్నీ కళ్ళముందు కదులుతున్నాయి దేవయ్యకు.

తన చిన్నప్పటి నుండీ చూసిన పెళ్ళిల్లు, కొట్లాడి తెచ్చుకున్న కట్నాలు, 'సాకలోడివంటే పెద్దకొడుకువు బిడ్డా! సావుకు తలారోడు, పెళ్ళికి సాకలోడు పెద్దకొడుకులు. వీల్లేగదా అన్ని పనులకు ముందు నడిచేది.' అన్న మాటలు గుర్తుకొచ్చాయి. పెళ్ళితో అల్లుకుపోయిన కథలు అనుభవాలు గుర్తుకొచ్చాయి. తీపితీపి జ్ఞాపకాల్లా!

"లింగమూ.... ఇక్కడమనముంటే అందరూ మననే చూస్తున్నారు. ఔతలికి పోదాంపదరా... ఇది మనసోంటోళ్ళుండే జాగకాదు. చేతెరుగని బొడ్డి మొగని పెండ్లికి పోయిందట అన్నట్టుంది

మనకథ. ఆసవడ్డనోట్లె పాసువడ్డట్టయింది. ఉన్నోళ్ళు ఉన్నోళ్ళతోనే సోపతి జేత్తరు. పాము కుసమిడిసినట్టు ఎప్పుడో ఒకయాల్లన తెల్వకుంటనే మనం దూరమైతున్నం.'' లింగం చెయ్యివట్టి లాగుతున్నాడు బాలయ్య.

చప్పుడు మోగుతుంది తలంబ్రాలు ఎత్తుతున్నారు. వీడియోలో రంగురంగులుగా కనబడడానికి బియ్యంలో పేలాలు, రంగుల బంతులు కలుపుతున్నారు. ఇండియాలో పెండ్లి పద్ధతులంటే అమెరికావారికి చాలా ఇష్టమని సాంప్రదాయ పద్ధతిలో పెళ్ళి జరిపించాలని పట్టుబట్టారని అక్కడివారు అనుకుంటే విని అర్థంకాని అయోమయంతో ముగ్గురూ బయటకు నడిచారు. చప్పుళ్లను, సందడినిబట్టి లోపల ఏం జరుగుతుందో అంచనావేసుకుంటున్నారు ముగ్గురు.

"ఇప్పుడు భోజనాలకు లేచినట్టున్నారు.'' దేవయ్య అన్నాడు కొంతసేపు ఆగినాక.

గేటుముందు ఆటో ఒకటి ఆగింది. లోపలనుంచి కుర్చీలను మడతలుగాపెట్టి ఆటోలో వేస్తున్నారు. "అక్కడ పెళ్ళికి టైమైంది తొందరగా!'' వెంటనున్న మనిషిని తొందరపెడుతున్నాడు టైం చూసుకుంటూ టెంట్ ఓనర్.

బ్రాహ్మణుడు బండిమీద పిట్టలా ఎగిరిపోయాడు. వెంట ఎవరో ఉన్నారు. ఒక్కొక్కరే వాహనాలను వెదుక్కుంటూ వెళ్తున్నారు ఆగమాగంగా.

హడావుడిగా ఎక్కడికో వెళ్ళబోతూ ముగ్గురునిచూసి పరుగుపరుగున దగ్గరికి వచ్చాడు కొండల్‌రావు. "అరే... మీరు ఇక్కడున్నరేందిరా....? అన్నంతినుపోండ్రి. నిన్నటినుండి సూస్తున్న మూలమూలలు ఈగినట్టున్నరేందిరా..?'' అడిగాడు.

ఎవరూ నోరు తెరువలేదు. అడుగులో అడుగేసుకుంటూ లోపలికి నడిచారు. కుర్చీలువేసిన స్థానమంతా ఖాళీగానే కనిపించింది. పెండ్లి పందిరి వద్ద కొద్దిగా సందడి. ఎవరూ కన్నెత్తి అటువైపు సూడలేదు. అన్నంతినే చోటికి నడిచారు.

అక్కడ మంది పలుచబడ్డారు. అడుగుతీసి అడుగుపెట్టరానట్టుగా బొక్కలు, అన్నం మెతుకులు, ఎంగిలి పల్లాల్లోకూడా.. ఎవరో దులుపుతున్నారు. ఎవరో కడుగుతున్నారు. రకరకాల వంటలు, స్వీట్లు, ఐస్‌క్రీం. తిన్నదానికంటే ఎక్కువగా విడిచిపెట్టిందే!

"ఇస్తారువేసి కూసుండవెట్టి పెడితే కూరయినా అన్నమయినా బరుకతుంటది. తిన్నోల్లకు తుర్తిగుంటది. పెయిన పడుతది.'' ఆభీభత్సాన్ని చూసి వికారంగా మొహం పెడుతూ అన్నాడు బాలయ్య.

"ఇప్పుడు యాడజూసినా ఇట్లనే నడుత్తుంది.'' ప్లేటు అందుకుంటూ అన్నాడు లింగం.

"ఆ... ఇంత అద్వాన్నంగా మాత్రం కాదు''. ముక్కురిల్లిస్తూ అన్నాడు దేవయ్య. ఎవరిపెండ్లో గుర్తులేదుగాని, పందిట్లో మేక పిల్లను కొయ్యబోతూ విడిచిపెడితే మేకదొరుకక పొద్దంతా తిరిగానని, ఒక పెండ్లిలో మేకనుకుని రాత్రి పూట దుడ్డెను కోసినమని తండ్రి నవ్వుతూ చెప్పిన మాటలు ఎందుకోగాని దేవయ్య బొచ్చెలో మెరిసినయి.

అక్కడి అంగడి చూసాక ఇంతకుముందు డాబుగా ధర్జాగా కనిపించిన వారేనా ఇలా

తిన్నది అనిపించింది. ఎవరికీ తినబుద్ధికాలేదు. నీల్లు మాత్రం తాగి బయటకు వచ్చారు ముగ్గురు.

వారికొరకే నిలిచినట్టు బయట జీబు. అందరితోపాటు ఎక్కి కూర్చున్నారు. ఐదునిమిషాల్లో ఇంటి ముందున్నారు. ఇంతకుముందున్న టెంట్‌మాయం. అంతా ఖాళీ!

ఇంట్లో ఇంటి వాళ్ళదే సందడి. ఎక్కడెక్కడో తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చారు ముగ్గురు. పెళ్ళికూతురు కొత్త పెళ్ళికళతో ఎదురైంది. అమెరికా పెళ్ళికొడుకు అక్కడలేడు. దొర్సాని హడావిడిగా తిరుగుతుంది. నాలుగైదు కొత్త మొహాలు. పటేలు మాత్రం తీరిగ్గా కూర్చున్నాడు. ముగ్గురిని చూడగానే దగ్గరికి పిలిచి సంతోషంగా అడిగాడు.

"పెళ్ళి ఎలా జరిగిందిరా.... బాలూ...... మంచిగనిపిచ్చిందా... మా చుట్టాలయితే గ్రాండుగ చేసినవంటుండ్రు. చిన్న ఖర్చయినాదిరా..."

గంగిరెద్దులా ముగ్గురు తలూపారు.

"మల్లెపూల దండలకే ఐదు వేలయినయి. డెకరేషనుకు, పెండ్లి సెట్టుకు ఇరవైవేలు, సౌండ్స్‌కు...".

పటేలు చెబుతున్నవన్నీ వెయిలలెక్కలే! ఏవేవో ఎన్నడూ వినని మాటలు చెబుతున్నాడు పటేలు. పెయ్యంత జిలజిల మంది.

"పటేలా పోయస్తం. లేటయితే బస్సు దొరుకది". ముగ్గురు ఒకేసారి అన్నారు.

"అగో అంత తొందరేందిరా! రేపు పోండ్రి. ఇంటికాడ మావులజేత్తరా". అదిలించాడు కొండల్‌రావు

"వద్దు పటేలా వెళ్తం! ఇంటికాడ ఎదిరిసూత్తరు. దొర్సాని ఏదో పనిల ఉన్నట్టుంది. పోయినమని సెప్పుండ్రి". చెప్పినా వినకుండా ముందుకు కదిలారు. మొహాల్లో రక్తం చుక్కలేదు. ఏదో పోగొట్టుకున్నట్టు వెలితి బాధ.

వీధి మలుపు తిరుగుతుంటే కేక వినిపించింది. ముగ్గురు వెనక్కి తిరిగి చూసారు. ఇంట్లోని పనిమనిషి పరుగెత్తుకు వస్తున్నాడు.

"ఇదిగో మీరు ఈ ముల్లెను మరిసి పోయిండ్రట". నెత్తిమీద ముల్లెను అందిస్తూ అన్నాడు. వెంటగోరుగాలు, గిన్నెకూడా!

వాల్లు కనీసం విప్పిచూసినా, కులపోల్లతో కొట్లాడి రెండు రాత్రులు నిద్ర మాని జాజుపలుకను అందంగా గీచిన శ్రమను మర్చిపోయేవాడేమో బాలయ్య. ముల్లెముల్లెలాగనే ఉంది. అందుకుని భుజాన వేసుకున్నాడు. ముందటికంటే బరువుగా అనిపించింది. గోరుగాలు, గిన్నెను జేబులో వేసుకున్నాడు లింగం.

"మల్లెపూలకు ఐదువేలట, ఐదు వందలిస్తే మనం ఆరు నెలలు పేరు జొప్పుకొని తిందుంటిమి". బస్సెక్కుతూ గొణుక్కున్నాడు లింగయ్య.

"వాడంటే కార్లల్ల జీబులల్ల వచ్చె. మల్లెపువ్వులు అమ్ముడంటే మన తమ్మలి రాములు

తీర్గ దండలు కట్టిచ్చినట్టనుకున్నవా....? అదో బిజినిస్''. వెనుకనుంచి అన్నాడు దేవయ్య.

ఊరిపొలిమేరల్లో దిగే సరికి చీకటయింది.

బస్సు మలిగే చోటనే కంకర, ఇసుక, పునాదులు, బేస్‌మీట్..... డ్రైవర్ విసుక్కున్నాడు.

ముగ్గురూ బస్సు దిగారు.

"చూసినవా మామా... పెండ్లికి ఖర్చులేం తప్పలేదు. ఒకటికి రెండింతలయినయి. అచ్చిన చిక్కల్లా మనసొంటోడు బతికే ఖర్చుగాదు. మనకు పూటతిండి దొరికే పెండ్లిగాదు. ఇంతకుముందు మన ఊర్లె ఏ పెండ్లి జరిగినా మనకింత తిండిదొరికింది. ఖర్చుకు కట్నం దొరికింది. ఇప్పుడు జూసినవా...? ఆ పద్దతి సాపకింది నీరులెక్క ఇక్కడికస్తుంది''. కట్టడాన్ని చూపిస్తూ అన్నాడు దేవయ్య.

లింగయ్యకూ, బాలయ్యకూ ఒల్లు జలదరించింది. ఏదో రాక్షసగుహను చూసినట్టుగా భయమేసింది. ఆ పునాదుల్లో తమలాంటి వారినెందరినో పాతరేసి సమాదులు లేపినట్లుగా అనిపిస్తుంది. ఇద్దరి కళ్ళల్లో సన్నటి నీటిపొర.

ఏదో గుర్తొచ్చినట్టు బాలయ్య పునాదులవద్దకు గబగబా నడిచాడు. భుజం మీదున్న కుండల మూటను అందులోవేసి పిచ్చిపట్టినట్టు మట్టిని కప్పి ఊరివైపు వడివడిగా అడుగులేసాడు.

అప్రయత్నంగా లింగం చేతులు కదిలాయి. పునాదిలో గోరుగాలు, గిన్నె, ఐదు దోసిల్లమన్నుపోసి, పొట్టను చేతపట్టుకుని బాలయ్య వెంట అడుగులేసాడు.

పునాదిరాళ్ళను, ఇసుక, కంకరను మార్చి మార్చి బాంబులు పేలుతాయా..? అన్నంత భయంగా చూస్తూ వారివెంట నడిచాడు దేవయ్య.

ఏడాది తిరక్కముందే.... భవనంపై 'వాసవీ మ్యారేజ్ హాల్' బోర్డు వెలిసింది.

కుల వృత్తులు ఈనాడు కాదు ఏనాడో పోయినయి. కనీసం పెండ్లితో ముడివడ్డ ఒకటి రెండు పనులైనా పట్టణాల్లో ఎప్పుడో పోయినయి. అవి ఇప్పుడు పల్లెల్లో కూడా....

ముగ్గురూ దాని ముందు కూర్చుని పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటున్నారు. ●